www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 8 ఫిబ్రవరి 2025

5

వైఎస్ఆర్



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-కడప

కడప పట్టణంలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో భాగంగా ఈ నెల 8వ తేదీన పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరి నాయక్ తెలిపారు. ముత్రాసుపల్లి, రెడ్డి కాలనీ, పకీరుపల్లి, ఒంటిమిట్టనగర్, అబ్బుల్ కలాం కాలనీ, చిన్నచౌక్, విద్యా మందిర్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ, దేవునికడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తేచౌక్, భారతీనగర్, ద్వారకా నగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సిపి బ్రౌన్, మున్సిపల్ ఆఫీస్, ఆర్టీసీ బస్టాండు, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు, తదితర ప్రాంతాలలో ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులకు కలిగే విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

సమగ్రంగా చర్చించేనా?

- రబీపై లోతైన చర్చ అవసరం
- కదలని ఉక్కు పరిశ్రమ పనులు
- షాదీఖానా అద్దెల గోల్‌మాల్‌పై ఏదీ స్పష్టత
- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



కడప జిల్లా పరిషత్ సమావేశ భవనం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై పాలకుల్లో చిత్తశుద్ధి కొర వడింది. శనివారం జడ్‌పి ఛైర్మన్ అధ్యక్షతన జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహణకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో 72 నుంచి అనుబంధ విభాగాలను కలుపుకుని 102 శాఖలు ఉండగా, కేవలం 11 నుంచి 15 శాఖ లకు చర్చను పరిమితం చేయనుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతం. జీవనాధారమైన రంగంపై సమగ్రంగా చర్చించాల్సి ఉంది. ముఖ్యంగా రబీ సీజన్‌లో రైతాంగం ఎదుర్కొంటున్న నకిలీ విత్తన నివారణ, బుడ్డశనగ ధరల తగ్గుదల, అన్నదాతా సుఖీభవ నిధుల జమ, క్రాప్ ఇన్సూరెన్స్ వంటి సమస్యలపై దృష్టి సారించాల్సి ఉంది. వ్యవసాయ, పారిశ్రామిక. సాగునీటి పారుదల, విద్య, వైద్య రంగాలు ఎదుర్కొంటున్న ప్రతికూలతలు జిల్లా ప్రగతిని ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. జిజిహెచ్ సూపర్ స్పెషాలిటీ, కేన్సర్ విభాగాలకు వైద్య నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, టెక్నీషియన్స్ కొరతపై దృష్టి సారించాలి. ఉక్కు పరిశ్రమ, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ నిర్మాణ పనులపై చర్చించాల్సి ఉంది. కొప్పర్తి పైప్‌లైన్ పనుల పురోగతిని ఆరా తీయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాలో వరి రైతు నకిలీ విత్తన సమస్యతో సతమతమవుతున్నారు. రవి తర్వాత ప్రధాన ఆహార పంట బుడ్డశనగ. జిల్లాలో సుమారు 1.80 లక్షల ఎకరాల్లో సాగు చేయడం తెలిసిందే. ఇటువంటి ప్రధాన పంట దిగు బడుల తోపాటు మార్కెట్లో ధరల తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వమే కొనుగోలు చేయడంపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉరుముతోంది. అన్నదాతా సుఖీభవ, సబ్సిడీ డ్రోన్ల పంపిణీ వ్యవహారం తేల్చాలి. విద్యకు సంబంధించిన ఫీజురీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం పథకాల నిధుల జమ చేయడంపై నిలదీయాల్సిన అవసరం ఉంది. వైద్యరంగానికి వస్తే జిజిహెచ్ సూపర్ స్పెషాలిటీ, కేన్సర్ విభాగాలకు వైద్య నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, ఆధునిక పరికరాల ఆపరేటర్ల నియామకం వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, శ్రీనివాసపురం రిజర్వాయర్ల పనులను పూర్తి చేయాల్సి ఉంది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువల పనులకు మోక్షమెప్పుడో తేలాల్సి ఉంది. కడప కార్పొరేషన్‌లో దేవునికడప రహదారి విస్తరణ పెండింగ్, నాలుగు స్ట్రోమ్ డ్రెయిన్ పనులపై చర్చించాల్సిన అవసరం ఉంది. గండికోట, సోమశిల నిర్వాసితుల మొరను ఆలకించాలి. సర్వారాయసాగర్, బ్రహ్మసాగర్, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలోని లింగాల కాల్వ లీకేజీ, యురేనియం పైప్‌లైన్ పనుల నత్తనడకను సమీక్షించాలి. 2021 నవంబర్ వరదల్లో అన్నమయ్య రిజర్వాయర్ మట్టికట్ట తెగిన సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్వాసితులకు ఇచ్చిన హామీలో పురోగతి కొరవడింది. యర్రబల్లి-పార్నపల్లి పైప్‌లైన్ పనుల ఆలస్యం కారణంగా యురేనియం నిర్వాసిత గ్రామాలకు తాగునీటి సమస్య ఎప్పటికి పరిష్కారమవు తుందో తెలియలేదు. గండికోట నిర్వాసితులకు రూ.ఏడు లక్షల పరిహారానికి అదనంగా మరో రూ.మూడు లక్షలను అందిస్తామని ఇచ్చిన హామీ అమలు కావడం లేదు.

ఉక్కు పరిశ్రమ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో ఉక్కు పనుల పురోగతిపై సందేహం నెలకొంది. 2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట తాము అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ వైఫల్యం జిల్లాకు శాపంగా మారింది. 2024 ప్రథమార్థంలో జెఎస్‌డబ్ల్యూ చేపట్టిన ఉక్కు పరిశ్రమ పనుల్లో ఎటువంటి కదలిక కనిపించడం లేదు. రూ.150 కోట్ల కొప్పర్తి పైప్‌లైన్ ఏర్పాటు ప్రక్రియ ఎప్పటికి పూర్తవు తుందో తెలియడంలేదు. ఐసిడిఎస్ పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో మగ్గుతున్నాయి. ఐసిడిఎస్ జిల్లా అధికారులు అంగన్వాడీ భవన నిర్మాణాలను చేపట్టడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. జడ్‌పి నిధుల నుంచి చేపడతామన్నా ముందుకురాని పరి స్థితి నెలకొంది. జిల్లాలోని సుమారు 17 నుంచి 18 షాదీ ఖానాల అద్దె వసూళ్ల గోల్‌మాల్‌పై పెదవి విప్పని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా పరిషత్ పాలకవర్గం జిల్లా సమగ్రాభివృద్ధిపై సమగ్రమైన చర్చ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పడంలో సందేహం లేదు.

ఎపిజిబిని కడపలోనే కొనసాగించాలి

- పోస్టర్ ఆవిష్కరణలో అభివృద్ధి వేదిక నాయకులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఓబుల్‌రెడ్డి, లక్ష్మీరాజ

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఎపిజిబి) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా డిమాండ్ చేశారు. శుక్రవారం ఓ ప్రయివేటు ఆస్పత్రిలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అతి పెద్దదైన ఎపిజిబిలో మిగిలిన గ్రామీణ బ్యాంకులు విలీనం అవుతున్న నేపథ్యంలో ఇక్కడి ప్రధాన కార్యాలయాన్ని ఇక్కడే కొనసాగించాలని అమరావతికి తరలించాలనే ప్రయత్నం విరామించుకోవాలని చెప్పారు. ఇది పాలకవర్గ పార్టీలకు రాయలసీమ పట్ల వున్న వివక్షకు నిదర్శనమని తెలిపారు. రాయలసీమ ప్రజలు రాజకీయాలకు అతీతంగా ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని విలీనం తర్వాత కూడా కడపలోనే కొనసాగిం చాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. వ్యాపారంలో, లాభాల్లో, మౌలిక సదుపాయాలు కలిగి ఉండడంలో, సాంకేతికత, కరెన్సీ చెస్ట్ ఇలా అన్నింటా ఎపిజిబి దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. అలాంటి బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడమంటే వెనకబడిన ప్రాంతాల పట్ల కక్ష పూరిత వైఖరి ప్రదర్శించడమేనన్నారు. ఇప్పటికే లోకాయుక్త, ఎంఎస్ఎంఇ ట్రైనింగ్ సెంటర్‌ను, న్యాయ విశ్వవిద్యాలయాన్ని, హైకోర్టును, నార్కోటిక్స్ కోర్టులను రాయలసీమకు లేకుండా చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, సాంప్రదాయం ప్రకారం కడపలోనే ఎపిజిబి హెడ్ క్వార్టర్‌ను కొనసాగించాలని తెలిపారు. లేనిపక్షంలో రాజకీయాలకతీతంగా అన్ని పక్షాలను, ప్రజాసంఘాలను, మధ్యతరగతి ఉద్యోగులు, ఉపాధ్యాయులను, ప్రజలను, బ్యాంకు అకౌంట్ హోల్డర్స్‌ను సమీక రించి పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అభివృద్ధి వేదిక నాయకులు ఇ.ప్రవీన్, లోహిత్ మనోజ్, రవి పాల్గొన్నారు.

వేసవిలో నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - కడప

వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించి తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో వేసవిలో పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి అవసరాల సన్నద్ధతపై సంబంధిత మున్సిపల్, ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు ఎలాంటి కొరత లేకుండా తాగునీటి సదుపాయం, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. మార్చి 20వ తేదీ లోపు పులివెందుల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ప్రాంతాల్లో సమృద్ధిగా తాగునీరు అందేలా పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా పనులను పూర్తి చేయాలన్నారు. అందుకు సంబంధించి చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలను అందజేసి త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అధిక నీటి ఎద్దడి పరిస్థితులు లేకపోయినప్పటికీ ఈ వేసవిలో అన్ని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు సరిపడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సంబంధించి ప్రణాళికలను రూపొందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణ, ప్రాంతాల్లో తాగునీటి అవసరాలతో పాటు రూరల్ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి పులివెందుల మున్సిపాలిటీకి తాగునీరందించే పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్‌ఇ వీరన్న, ఇఇ విజయ్ భాస్కర్, పులివెందుల మున్సిపల్ కమిషనర్ రాముడు, ఇఇ చిదానంద రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఇఇ రమణమూర్తి పాల్గొన్నారు.

పిఎఫ్ ఖాతాను ఆన్‌లైన్ చేయాలి

- జడ్‌పి సిఇఒకు యుటిఎఫ్ వినతి



జడ్‌పి సిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు సంబంధించి 2023-24, 2024-25 వార్షిక జమలను వెంటనే ఆన్‌లైన్ చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సి.ఓబులమ్మకు యుటిఎఫ్ జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో సిఇఒను ఆమె ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ జిల్లాలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ జీతభత్యాలు నుంచి కొంత సొమ్మును ప్రతినెల పిఎఫ్ ఖాతాలకు పొదుపు కింద జమ చేస్తున్నారని చెప్పారు. వీటి వివరాలను 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు మాత్రమే ఆన్‌లైన్ చేశారని, ఆ తర్వాత 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ చేయలేదని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఎప్పటికప్పుడు జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది ఆన్‌లైన్ చేయకపోవడం వల్ల ఉపాధ్యాయులు చెల్లించిన సొమ్ములు సక్రమంగా ఖాతాలో జమ అవుతున్నాయో లేదో తెలుసుకోలేని పరిస్థితి ఉందన్నారు. ఆర్థిక సంవత్సరం ముగియగానే ఎప్పటికప్పుడు ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను ఆన్‌లైన్ చేస్తే ఉద్యోగులకు తాము దాచుకున్న సొమ్ములు ఎంత ఉన్నాయో తెలియడంతో పాటు, ఖాతాల నిర్వహణ పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత అవసరాల రీత్యా రుణాల కొరకు దరఖాస్తు చేసుకున్న సందర్భంలో, రుణాల మంజూరులో జాప్యం జరుగుతున్నదని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులు పిఎఫ్ తుది చెల్లింపుల మంజూరు విషయంలోనూ చిన్న చిన్న కారణాలను సాకుగా చూపుతూ తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు, ఆవేదనకు గురవుతున్నారని చెప్పారు. రుణాల మంజూరు, తుది చెల్లింపుల మంజూరు విషయంలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. మిస్సింగ్ క్రెడిట్స్‌ను ఉపాధ్యాయుల ఖాతాలలో జమ చేయించుటకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ చేశారని, కడప జిల్లాలో కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ అంశంపై సి.ఓబులమ్మ స్పందిస్తూ 2023-24, 2024-25 వార్షిక సంవత్సరానికి సంబంధించిన జమలను వెంటనే ఆన్లైన్ చేయిస్తామని తెలిపారు. రుణాల మంజూరు విషయంలోనూ, అంతిమ చెల్లింపుల మంజూరులో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్, జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రూతు ఆరోగ్య మేరీ, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.చంద్రశేఖర్, జి.గోపీనాథ్, ఎన్.మేరీ ప్రసన్న, వై.రామ కేశవ, ఎ.వీరనారాయణ పాల్గొన్నారు.

లేబర్ చట్టాన్ని అతిక్రమిస్తే జైలు శిక్ష : జడ్జి



మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - కడప

బాండెడ్ లేబర్ సిస్టం చట్టాన్ని అతిక్రమిస్తే జైలు శిక్షతోపాటు జరిమానా వేయడం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో బాండెడ్ లేబర్ నిర్మూలన దినం పురస్కరించుకొని వర్క్‌షాప్, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన బాండెడ్ లేబర్ నిర్మూలన దినం నిర్వహిస్తామని తెలిపారు. బాండెడ్ లేబర్ యాక్ట్ 1976లో భారతదేశంలో బాండెడ్ లేబర్ సిస్టంను రద్దు చేయడానికి "ది బాండెడ్ లేబర్ సిస్టం (అబోలిషన్) యాక్ట్, 1976" అనే చట్టం రూపొందించబడింది తెలిపారు. ఆర్టికల్ 23, సెంట్రల్ సెక్టార్ స్కీమ్ ఫర్ రిహబిలిటేషన్ ఆఫ్ బాండ్ లేబర్ 2021, బాండెడ్ లేబర్స్ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు బాండెడ్ లేబర్ సంబంధించిన పథకాలను ప్రజలలోకి తీసుకొని వెళ్లాలని సూచించారు. వెట్టిచాకిరి నిర్మూలన, నిర్భంద ఉచిత విద్య, బాండెడ్ లేబర్ సిస్టం చట్టం 1976 ప్రకారం అతిక్రమించిన వారికి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తామని చెప్పారు. చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ రైట్స్, ప్రాథమిక హక్కులు, విధులు మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో కడప రెవెన్యూ డివిజనల్ అధికారి పి.జాన్ ఎర్విన్, డిస్టిక్ ట్రైనింగ్ కాలేజ్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కరీం, డిస్టిక్ ప్రొబేషన్ అధికారి చెన్నారెడ్డి, డిస్టర్బ్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్ యాదవ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఇతర డిపార్ట్మెంట్ల అధికారులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, ఎన్‌జిఒలు పాల్గొన్నారు.

మేయర్ వ్యాఖ్యలు సిగ్గుచేటు : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి-కడప అర్బన్



మాట్లాడుతున్న శివ

వైసిపిలో ఒక నాయకుడి వ్యక్తిగత సమస్యను ఎస్‌సి కులానికి ఆపాదించడం మేయర్ సురేష్ బాబుకే సిగ్గుచేటని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మసాపేట శివ, జనసేన నాయకులు గజ్జల సాయి అన్నారు. శుక్రవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 26వ డివిజన్‌లో వైసిపి ఇన్‌ఛార్జి చిగురుపాటి త్యాగరాజు వైసిపి ప్రభుత్వ హయాంలో వాటర్ ప్లాంట్ కోసం స్థలం కేటాయించుకుని అందులో నీటి సరఫరా చేయకపోగా ప్రభుత్వ స్థలాన్ని సొంత కార్యక్రమాలకి, వైసిపి ఆఫీస్‌గా వాడుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేషన్ అధికారులు తొలగించాలని వెళితే వీధిని మొత్తం దళిత ఇళ్లలు కూలుస్తున్నారని ఉసిగొలిపి ప్రభుత్వ అధికారులని దూషించారని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో దళితుల ఇళ్ల కూలిస్తే అధికారులను నిలదీయలేదు, దళితులకి అండగా నిలబడలేదనీ, ఇపుడొచ్చి ప్రభుత్వ స్థలాన్ని వైసిపి ఆఫీస్‌గా నడుపుతున్న త్యాగరాజుకి మద్దతుగా ఉండటమే గాక కులాల మధ్య వివక్ష అంటు అన్నదమ్ముల్లా కలిసున్న మా మధ్య చిచ్చు పెట్టాలని చూడటం తగదని హితవుపలికారు. ప్రభుత్వ స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. వైసిపి ఓడిపోయాక కూడా కులాల మధ్య చిచ్చు పెట్టే, రెచ్చగొట్టే మాటలు మానుకోవాలని, ఇంకానైన బుద్ధి తెచ్చుకోవాలని తెలిపారు. సమావేశంలో జనసేన నాయకులు తుంగ రమణయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనం మంజూరుకు వినతి

ప్రజాశక్తి - బద్వేలు : పట్టణంలో 60 సంవత్సరాలుగా గ్రంథాలయం అద్దె ఇండ్లలోనే నిర్వహిస్తున్నారని, అధికారులు గానీ ప్రజాప్రతినిధులు గానీ స్పందించకపోవడం చాలా దారుణమని ఆవాజ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యస్‌దానిబాషు, జిల్లా అధ్యక్షులు పి.చాంద్ భాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ పట్టణంలో వందలాది ఎకరాలు భూ కబ్జాకు గురవుతున్నప్పటికీ పట్టించుకోని అధికారులు కేవలం మూడు సెంట్లు స్థలం గ్రంథాలయ భవనానికి మంజూరు చేయకపోవడం ఏమిటనే ప్రశ్నించారు. గ్రంథాలయాలు వ్యక్తిత్వ వికాసానికి కేంద్రాలన్నారు. వీటిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రతినిత్యం ఎంతోమంది విద్యార్థులు, పాఠకులు సందర్శిస్తారని, అలాంటి వారి కోసం సొంత భవనాలలో ఏర్పాటుచేస్తే సమాజం పట్ల, ప్రపంచ స్థితిగతులపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. గ్రంథాలయ భవనానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆవాజ్ పట్టణ అధ్యక్షులు ఎస్.ఎ.సత్తార్, నాయకులు రసూల్, అబ్దుల్లా, మునీర్, రవిశంకర్ పాల్గొన్నారు.

యుసిఐఎల్ వ్యర్థాల కలుషితంపై నిరసన

ప్రజాశక్తి-వేముల

మండల కేంద్రంలోని తుమ్మలపల్లి యురేనియం కర్మాగారం నుంచి వెలువడే వ్యర్థాలను నిల్వచేసే కె.కె.కొట్టాల గ్రామ సమీపంలోని టెయిలింగ్ పాండ్ నుంచి శుక్రవారం పెద్ద ఎత్తున దుమ్ము ధూళి వెలువడి గాలిలో కలుషితమై గాలికి కె.కె.కొట్టాల గ్రామం వైపు పెద్ద ఎత్తున కలుషితమైన గాలి వీచడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. టైలింగ్ పాండ్ నుంచి పెద్ద ఎత్తున దుమ్ము, ధూళి కలుషితమై గ్రామం వైపు రావడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తూ టెయిలింగ్ పాండ్ మెయిన్ గేటు దగ్గరికి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న యురేనియం సంస్థ అధికారి నవీన్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నవీన్‌రెడ్డితో మాట్లాడుతూ ఈ టెయిలింగ్ పాండ్ వల్ల ఇప్పటికే నీరు కలుషితమై అనేక వ్యాధులతో ఇబ్బంది గురవుతున్నామని ఇప్పుడు మరలా టెయిలింగ్ పాండ్ నుంచి పెద్ద ఎత్తున దుమ్ము, ధూళి కలుషితమై మా గ్రామం వైపు వస్తుందని తద్వారా మాకు శ్వాస సంబంధ, చర్మ వ్యాధుల బారిన పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులతో నవీన్‌రెడ్డి మాట్లాడుతూ టెయిలింగ్ పాండ్ నుంచి దుమ్ము, ధూళి పైకి లేవకుండా ఎప్పటికప్పుడు నీళ్ల చల్లుతున్నామని ఇకమీదట ఈ దుమ్ము, ధూళి గాలిలో కలషితమవ్వకుండా తగు జాగ్రత్తలు, చర్యలు చేపడతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గ్రామస్తుల ఆందోళన విషయం తెలుసుకున్న యురేనియం అధికారులు వెను వెంటనే ఫైర్ ఇంజన్ తెప్పించి తద్వారా దుమ్ము, ధూళి పైకి లేవకుండా నీటి చల్లడం ప్రారంభించారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఇకమీదట టెయిలింగ్ పాండ్ నుంచి దుమ్ము, ధూళి వెలువడి గ్రామం వైపు వస్తే అందుకు యురేనియం అధికారులే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని టెయిలింగ్ పాండ్ పనులను కూడా ఆపేందుకు వేనుకాడమని తేల్చి చెప్పారు.



నిరసన తెలుపుతున్న కె.కె.కొట్టాల గ్రామస్తులు

స్టెమితో గుండెకు భరోసా

ప్రజాశక్తి-బద్వేలు :గుండె జబ్బుల మరణాలను నివారించేందుకు స్టెమి చికిత్స గుండెకు భరోసా కలిపిస్తుందని బద్వేలు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం బద్వేల్ కమిటీ హెల్త్ సెంటర్‌లో తొట్టిగారిపల్లె, గోపవరం, పట్టణానికి ఆరోగ్య కేంద్రాలు సురేంద్ర నగర్, గాంధీనగర్, కోటవీధి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సిబ్బందికి గుండె జబ్బుల పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటు చికిత్సకు ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లి రూ.లక్షలు ఖర్చు చేసి అప్పులు పాలయ్యే బాధ నుండి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. గుండెనొప్పి చికిత్సకు అవసరమైన మందులను జిల్లాలోని అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రాంతీయ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచారని తెలిపారు. గుండెపోటు లక్షణాలైన చాతినొప్పి, ఎడమవైపు భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వారు మొదట గంటలోపులే సమీపంలోని వైద్యశాలకు వెళ్లి అక్కడ వైద్య ప్రాథమిక పరీక్షలైన ఇసిబి తీసి, గుండె యొక్క పనితనంను చూసి గుండెకు సంబంధించిన నొప్పి ఉన్నట్లయితే గుండె సంబంధించిన వ్యాధిగా గుర్తిస్తే రూ.45 వేలైన టేనెక్టివ్ ప్లస్ ఇంజక్షన్ ఉచితంగా అందజేసి ప్రాణాపాయం లేకుండా అందించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె.వినయ్ కుమార్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ సౌమ్య, డాక్టర్ శ్రీకాంత్, హెల్త్ ఎడ్యుకేటర్ బి.వెంగయ్య పాల్గొన్నారు.

విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - కడప : పర్యావరణానికి ఎలాంటి అంతరాయం లేకుండా, నిబంధనలకు లోబడి కడప విమానాశ్రయం అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో విమానాశ్రయం, ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పౌర విమానయాన సేవారంగంలో ప్రయాణీకుల అనుభవాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని భారతీయ విమానాశ్రయాలను ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయికి దీటుగా అభివృద్ధి చేస్తోందన్నారు. ఆధునిక జీవనశైలికి అనుగుణంగా విమానాశ్రయాల్లో ప్రయాణీకులకు సౌకర్యాలను మెరుగు పరుస్తోందన్నారు. కార్యక్రమంలో ఎఆర్ ఎఎస్‌పి రమణయ్య, విమానాశ్రయం డైరెక్టర్ సుజిత్ కుమార్ పోదర్, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, ఏయిర్‌పోర్ట్ డిజిఎంలు వి.రాజశేఖర్, పి.వి.శ్రీధర్, జెఇబి నిఖిల్, టెర్మినల్ మేనేజర్ ఎన్.జోబన్న, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, ఎహెచ్ జెడి శ్యారదమ్మ, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'ఆలయ నిర్మాణానికి కలిసికట్టుగా పనిచేద్దాం'

ప్రజాశక్తి-కాశినాయన

కాశినాయన జ్యోతి క్షేత్రంలోని ఆలయ నిర్మాణానికి అందరం ఐకమత్యంగా కలిసికట్టుగా పనిచేసి నిర్మాణం పూర్తయ్యేంత వరకు పోరాడుదామని బ్రహ్మంగారిమఠం అచలానంద ఆశ్రమ వ్యవస్థాపకులు విరాజానంద స్వామి పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందలాది మందికి ప్రతినిత్యం ఉచితంగా అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇలాంటి ఆలయం మూతపడుతుంటే మనమంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. న్యాయబద్ధంగా పోరాటం చేసైనా సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి బద్వేలు నియోజకవర్గ నాయకుడు కర్నాటి వెంకటరెడ్డి, వైసిపి బద్వేల్ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి, టిడిపి మండల నాయకుడు బసిరెడ్డి రవీంద్రారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణారెడ్డి, ప్రొద్దుటూరు రాఘవరెడ్డి, పెద్ద ఎత్తున భక్తులు, పూజారులు పాల్గొన్నారు

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

- గంటల తరబడి నిరీక్షించిన ప్రజలు

ప్రజాశక్తి-చెన్నూరు

మండల పరిధిలో తొమ్మిది సచివాలయం ఉండగా అందులో పనిచేస్తున్న సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించక పోవడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. శుక్రవారం చెన్నూరులోని సరస్వతి నగర్‌లోని మూడవ సచివాలయంలో ఉదయం 11 గంటలైనా సచివాలయం సిబ్బంది హాజరు కాకపోవడంతో అక్కడికి వచ్చిన స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. బిసి కార్పొరేషన్ పరిధిలో రుణాలు దరఖాస్తు చేసుకునేందుకు కుల ధ్రువీకరణ పత్రఒ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం అధిక సంఖ్యలో ప్రజలు రావడంతో అక్కడ సిబ్బంది లేకపోవడం వారు అక్కడనే నిరీక్షణ చేయడంతో దరఖాస్తులు చేసుకునేందుకు సమయం అయిపోతుందని ప్రజలు ప్రజలు ఆందోళన గురవుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడంతో సచివాలయం సిబ్బంది ఉదయం ఆలస్యముగా రావడం సాయంకాలం 3 గంటలకు వెళ్లిపోవడంతో సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చరవాణిలో రెవెన్యూ కార్యదర్శికి సంప్రదించగా వారు గ్రామాలకు సర్వేలకు వెళ్లారని, తాను రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నాని పేర్కొన్నారు ఇప్పటికైనా పైఅధికారుల స్పందించి సచివాలయం సిబ్బందిని సమయపాలన పాటించాలని ప్రజలకు సేవలందే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. సుగాల కాలనీకి చెందిన విజయ్ చెన్నూరు ఉదయం 10 గంటల నుండి సచివాలయం వద్ద వేచి ఉన్న సచివాలయం సిబ్బంది రాక తమ పనులకు ఇబ్బంది కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సుగాలి కాలనీకి చెందిన శంకర్ కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చి గంటకు పైగా వేచిఉన్నా అధికారు రాలేదని తాము కూలీ పనికి పోతేనే మాకు పూట గడుస్తుందని ఒక రోజంతా దీనికోసం సమయం కేటాయించింది వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని ఏ సచివాలయంలోనైనా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నా అక్కడ విఆర్వోలు స్పందించకపోవడంతో ప్రజలు మూడవ సచివాలయం వద్ద ఉండవలసి పరిస్థితి వచ్చింది.



సమస్యలు వింటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సమస్యలపై పోరాడుదాం : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సమస్యలపై పోరాడుదామని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వారి సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. దీనికి ఆయన స్పందిస్తూ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారికి భరోసా ఇచ్చారు. ఎవరూ అధైర్య పడవద్దన్నారు. ఎప్పటికీ మీ వెంటే ఉంటామని ఎంపీ తెలిపారు.



నగదుతో దేవస్థాన అధికారులు, అర్చకులు

గండిలో హుండీ కానుకల లెక్కింపు

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారి హుండి కానుకలను లెక్కించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కానుకల ద్వారా రూ.17,00,750 నగదు, నాలుగు మిల్లీ గ్రాముల బంగారు, వెండి వస్తువులు.. అన్నదానం హుండీ ద్వారా రూ.30,065 భక్తులు సమర్పించారని తెలిపారు. అధికారులు, దేవస్థానం ఉద్యోగులు రాష్ట్ర ఉన్నతాధికారుల సూచన మేరకు సంప్రదాయ వస్త్ర ధారణతో పరకామణి నిర్వహించామని తెలిపారు. కార్యక్ర మంలో జిల్లా దేవ దాయశాఖ ఇన్‌స్పెక్టర్ భారతి, ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజా స్వామి, ఆలయ పాలకమండలి చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, చక్రాయపేట ఎపిజిబి మేనేజర్ భానుచంద్ర, ఆర్కేవ్యాలీ పోలీస్ సిబ్బంది, మారేళ్లమడక విఆర్‌ఒ, సిబ్బంది పాల్గొన్నారు.

బిసి రుణాల దరఖాస్తు గడువు 12కు పెంపు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రభుత్వం అందిస్తున్న బిసి కార్పొరేషన్ల రుణాలు పొందేందుకు దరఖాస్తు గడువును ఈనెల 12వరకు పొడిగించనట్లు మున్సిపల్ కమిషనర్ డి.రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి యూనిట్ల స్థాపన కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఆ ప్రకటనలో కోరారు.

చాపాడు : బిసి, ఇడబ్ల్యుఎస్, కాపు సహ వివిధ కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 12 వరకు పెంచారని ఎంపిడిఒ వీరకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి యూనిట్ల స్థాపన కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని కార్పొరేషన్‌ల ద్వారా మండలానికి 63 యూనిట్లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు.

గడువు పొడిగించడంపై మంత్రికి కృతజ్ఞతలు

వేంపల్లె : బిసి కార్పొరేషన్ కింద బ్రాహ్మణ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల పథ కాలకు దరఖాస్తు చేయడానికి గడువు పెంచడం పట్ల రాష్ట్ర మంత్రి సవితకు బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో కృత జ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆఖరి తేదీ కావడంతో జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రికి సమస్యను వివరించడంతో ఈనెల 12వ తేదీ గడువు పొడి గిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. బ్రాహ్మణ కార్పొరేషన్ కింద యూనిట్ల సం ఖ్యను కూడా మంత్రి దయతో పరిశీలించి సంఖ్యను పెంచాలని కోరారు.



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

వరిలో మురుగునీరు నిల్వ ఉంచరాదు

ప్రజాశక్తి - చాపాడు

వరిలో మురుగునీరు నిల్వ ఉంచరాదని కడప కెవికె శాస్త్రవేత్తలు సూచించారు. మండల పరిధిలోని చియ్యపాడు గ్రామ పరిధిలో శుక్రవారం వరి పొలాలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా నేలల్లో లవణ సాంద్రత ఎక్కువగా ఉండడం వల్ల వరి నాట్లు ఎండిపోతున్నాయని తెలిపారు. తప్పనిసరిగా భూసార, నీటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వరిలో కాండం తొలుచు పురుగు అధికంగా కనిపి స్తోందన్నారు. దీని నివారణకు 3డి కార్బొఫ్యూరాన్ గుళికలు వాడలని సూచిం చారు. జింక్‌ను ఎకరాకు 20గ్రాములు పిచికారి చేయలన్నారు. కార్యక్రమంలో ఊటుకూరు డాట్ సెంటరు కో–ఆర్డినేటర్ డాక్టర్ అంకయ్య, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ వీరయ్య, డాక్టర్ భగవత్ ప్రియ, మండల వ్యవసాయ అధికారి మ్యాగీ, విఎఎ రాము, రైతులు పాల్గొన్నారు.

9న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం కడప పట్టణానికి చెందిన సన్‌రైజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలోఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు కొనసా గుతుం దన్నారు. గుండె సంబంధిత సమస్యలు, థైరాయిడ్, కిడ్నీ, డయాలసిస్ సేవలు, మెదడు, వెన్నెముక, ప్లాస్టిక్ సర్జరీ, పలు రకాల కేన్సర్ జబ్బులకు వైద్య సేవలు లభిస్తాయన్నారు. ప్రముఖ వైద్యులు రానున్నారని, ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మీసేవ కేంద్రాల అధిక వసూలుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానికంగా ఉన్న మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రజల నుంచి అధికంగా వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి. మీసేవ కేంద్రాల నిర్వహకులకు సహకరిస్తున్నారని స్థానికంగా ఉన్న ప్రజలు కొందరు ఆరోపిస్తున్నారు. మీసేవ కేంద్రాలపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని పేర్కొం టున్నారు. అక్రమ ఆదాయార్జనకు పాల్పడుతూ ప్రజల నుంచి దోచు కుంటు న్నారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. ఖాజీపేట పట్టణం శ్రీనివాస్ నగర్‌కు చెందిన హరి భాస్కర్‌రెడ్డి మీసేవ కేంద్రాల దోపిడీపై శుక్రవారం తహసిల్దార్ మహబూబాషాకు ఫిర్యాదు చేశారు. సర్వీస్ ఛార్జీల కింద రూ.50 రసీదు ఇచ్చి రూ.100 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రశ్నిస్తే ఎవరికి ఫిర్యాదు చేసినా మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరనే సమాధానం చెబుతున్నారని పేర్కొం టున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి మీసేవ కేంద్రాల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, ఫీజుల వివరాలు డిస్‌ప్లే చేయాలని పలువురు కోరుతున్నారు.

పొలాల కోతను నివారించరూ..!

ప్రజాశక్తి - చాపాడు

కుందూ నది సమీపంలో వంకల వద్ద వర్షాలకు పంటపొలాలు కోతలకు గురవుతున్నాయని, నివారణకు కరకట్టలను నిర్మించాలని రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా సీతారామపురం, అల్లాడుపల్లె గ్రామాల వద్ద వంకల నుంచి నదిలోకి నీరు కలిసే ప్రదేశాల వద్ద పంట పొలాలు అధికంగా కోత గురవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. నదిలో నీరు అధికంగా వచ్చే సమయంలో వంకలలోని నీరు సులభంగా పోయేందుకు వీలులేక పొలాల వద్ద అధికంగా నిలబడుతూ పంట పొలాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో ఉన్న పొలాల్లో పెద్దపెద్ద గుం తలుగా ఏర్పడి మట్టి పూర్తిగా చేరుతోంది. పంటలు సాగు చేసుకునేందుకు ఇబ్బందికరంగా మారుతోందని రైతులు పేర్కొంటున్నారు. కుందూ నదికి వంకల వద్ద కరకట్టల నిర్మిస్తే కోతలను నివారించవచ్చని, తద్వారా పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు కోరు తున్నారు. గతంలో కుందూ నది వరదలకు కోతకు గురికాకుండా అక్కడక్కడా నిర్మించారు. కొన్ని ప్రదేశాలలో నిర్మించేందుకు చర్యలు చేప ట్టాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే అది ఆచరణకు నోచుకోలేదు. ఇప్పటికైనా కోతకు గురవుతున్న ప్రాంతాలను గుర్తించి, నదిలో కరకట్టల నిర్మిస్తే ఉప యోగకరంగా ఉంటుందని రైతులు సూచిస్తున్నారు.



సీతారామాపురం వద్ద కోతకు గురవుతున్న ప్రాంతం

అస్తవ్యస్తంగా ప్రజాపంపిణీ వ్యవస్థ

- రేషన్ పంపిణీపై కార్డుదారుల మండిపాటు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల వ్యాప్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరిచి కార్డుదారులకు న్యాయం జరిగేలా వ్యవహరించాల్సిన రెవెన్యూ అధికారులు రేషన్ డీలర్లకు కొమ్ము కాస్తున్నారనే ఆరోపణలున్నాయి. రేషన్ డీలర్లపై అక్రమ ఆరోపణలు ఎన్ని వచ్చినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా వారిని వెనకేసుకొస్తున్నారని కార్డుదారులు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఈ ఫిబ్రవరి నెలకు సంబంధించి ఒక్కో కార్డుకు రెండు కిలోల వంతున బియ్యాన్ని తగ్గించి ఇస్తు న్నారని, దీనిపై ప్రశ్నిస్తే రేషన్ ఇవ్వబోం.. ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని కార్డుదారులు తీవ్రంగా ఆరోపి స్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాత్రం.. రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించను అంటూ గొప్పలు పలికారే తప్ప ఆచర ణలో మాత్రం భిన్నంగా ఉంటోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ దుకాణ నిర్వాహకులు అంతా అధికార పార్టీకి చెందిన వారు, కార్యకర్తలు కాబట్టే వారిని ఏమీ అనలేకపోతున్నారని ప్రజలు గుసగుసలాడుతున్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే ఏ ఒక్కరిని ఉపేక్షించబోనని చెప్పిన ఎమ్మెల్యే ఇప్పుడు ఎటువంటి చర్యలు తీసుకుంటారోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా నిర్వహించాల్సి ఉండగా అక్రమాలు అవినీతి ఆరోపణలు, కార్డుదారులపై బెదిరింపుల పర్వం కొనసాగుతోందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మహబూబ్ బాషా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, నిక్కచ్చిగా వ్యవహరించడం లేదనే ఆరోపణలు ప్రజల నుంచి ఎక్కువగా వినిపి స్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, కార్డుదారులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



పొలాలను పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి

నష్టపరిహారం ఇవ్వకపోతే ఆందోళన

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల పరిధిలోని టి.చౌదరి వారిపల్లి గ్రామంలో నకిలీ విత్తన వడ్లుతో నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని, నాణ్యతలేని విత్తన వడ్లు అమ్మిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎపి రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. వరి పంట నష్టపోయిన పొలాలను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 200 ఎకరాలు రైతులు నాణ్యతలేని వడ్లుతో నష్టపోయారని తెలిపారు. నాటిన 20 రోజులకే వరి పంట వెన్ను దశకు వచ్చిందని తద్వారా రైతులు తీవ్రస్థాయిలో నష్టపోతారని అన్నారు. పొలాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరారు. నాణ్యత లేని విత్తన వడ్లు అమ్మిన ఖాజీపేటకు చెందిన పుత్త ట్రేడర్స్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులను కలుస్తామని తెలిపారు. నష్టపరిహారం ఇవ్వకపోతే నష్టపోయిన రైతులను కలుపుకొని పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు రవణమ్మ, నాయకులు అరవింద్, ప్రదీప్, బాధిత రైతులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎస్‌పి మురళీనాయక్

హెల్మెట్ తప్పక ధరించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డిఎస్‌పి మురళీనాయక్ సూచించారు. ఎస్‌పి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలో డిఎస్‌పి అధ్యర్యంలో ద్విచక్ర వాహనంలో హెల్మెట్లు ధరించి పోలీసులు అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరింపుతో ప్రాణాలు సురక్షిత మన్నారు. హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని పిలుపునిచ్చారు. పోలీ సులు హెల్మెట్ ప్రాధాన్యత వివరిస్తూ పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్ నుండి శ్రీనివాస హాల్, ఓల్డ్ గంగిరెడ్డి హాస్పిటల్, పూలంగళ్ల సర్కిల్, పాత బస్‌స్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పూలంగళ్ల సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటిం చాలన్నారు. పులివెందుల ట్రాఫిక్ సిఐ హాజీవలి మాట్లాడుతూ ప్రతి వాహన దారుడు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహ నాలు నడపరాదన్నారు. ఎంవిఐ బి.వెంకటప్రసాద్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించని వారిపై ఎంఎంవి యాక్ట్ ప్రకారం జరిమానాలు విధిస్తామన్నారు. పులివెందుల అర్బన్ సిఐ నరసింహులు, రూరల్ సిఐ వెంకటరమణ, సబ్ డివిజన్ ఎస్ఐలు, లయోలా కాలేజి విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి, అంకితభావంతో యుపిఎస్‌సి సాధ్యం

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటిలో యుపిఎస్‌సి పరీక్షలపై అవగాహన సదస్సును నిర్వహించినట్లు డైరెక్టర్ ఎవిఎస్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. సిఎస్ఇ విభాగం డాక్టర్ రత్నకుమారి పర్యవేక్షణలో శుక్రవారం అయ్యపు ఫణి వంశీనాథ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. తాను ప్రతిష్టాత్మకమైన బాంబే ఐఐటిలో బిటెక్ చదివి, ప్రీమియర్ సాఫ్ట్‌వేర్ సంస్థలో రూ.కోటి వార్షిక వేతనంతో ఉద్యోగం పొందినట్లు చెప్పారు. జీవితంలో మంచి స్థానం సంపాదించినప్పటికి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఆ ఉద్యోగాన్ని విడిచిపెట్టినట్లు పేర్కొన్నారు. తన సొంత ప్రిపరేషన్ ద్వారా మొదటి ప్రయత్నంలోనే యుపిఎస్‌సి 2014 ప్రిలిమ్స్, మెయిన్స్ పూర్తి చేశానని తెలిపారు. అంకితభావం, చిత్తశుద్ధితో ప్రతి ఒక్కరూ యుపిఎస్ సిని సాధించగలరని వివరించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి రవికుమార్, అకాడమిక్ డీన్ రమేష్ కైలాష్, ప్లేస్‌మెంట్ అధికారి సుందర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల మోసాలు ఎక్కువ అయ్యాయని, వీటి పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు గాయత్రి భాయి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రిజర్వు బ్యాంకు వారి సౌజన్యంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలు, సైబర్ నేరాల తదితర వాటి గురించి డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ విశ్రాంత సీనియర్ మేనేజర్ కృష్ణారెడ్డి, కెనరా బ్యాంకు ఎఫ్ఎల్‌సిసి వీర ప్రసాద్, హెర్డ్స్ సంస్థ కో–ఆర్డినేటర్ ఉదయ్ కుమార్, కెఎస్ రూరల్ మీడియా కళాజాత బృందం, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై మాట్లాడుతున్న కృష్ణారెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

నులిపురుగుల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - కడప

నులి పురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలి పారు. ఈనెల 10న జిల్లాలో ఉన్న 1నుంచి 19 సంవత్సరాల వయసులోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్ర లను పంపిణీ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులు సూచించారు. కలెక్టరేట్‌లోని బోర్డు సమావేశ హాలులో శు క్రవారం నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై (జిల్లా టాస్క్ ఫోర్స్ మీటింగ్) సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. వాల్‌పోస్టర్లు, కరపత్రాలు తయారు చేసి ప్రజల్లో అవ గాహన కల్పించాలన్నారు. ఐసిడిఎస్, విద్యాశాఖ, కమిషనర్లు, ఎంపిడిఒలు, సిడిపిఒలు, డిఆర్ డిఎలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన వాల్‌పోస్టర్లను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు, కడప మున్సిపల్ కమి షనర్ మనోజ్ కుమార్‌రెడ్డి, ఐసి డిఎస్ పీడీ శ్రీలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతమ్మ, రిమ్స్ సూపరింటెండెంట్ రమాదేవి, డిఐఒ ఉమా మహేష్‌కుమార్, ఆర్‌బి ఎస్‌కే పిఒ డాక్టర్ ఎస్ రమేష్, డీపీఎంఒ శశిభూషణ్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు

వేంపల్లె : నులి పురుగుల నివారణకు అల్బెండాజోల్ మం దులను మింగాలని ఎంపిడిఒ కుళాయమ్మ, వైద్యురాలు స్వాతి సాయి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శు క్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నులి పురుగుల నివారణ పోస్టర్లును ఎంపిడిఒ కుళాయమ్మ, వైద్యురాలు స్వాతిసాయి అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ వ్యాధులపై ఎక్కువగా ప్రచారం చేయాలని ఆరోగ్య సిబ్బందిని కోరారు. ఈనెల 10న నులి పురుగుల మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్‌జెడి రవిని సన్మానిస్తున్న కళాశాల బృందం

ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాని ఆర్‌జెడి రవి పిలుపునిచ్చారు. చక్రాయపేట జూనియర్ కళాశాలలో శు క్రవారం ప్రిన్సిపల్ షేక్ రంతుబాషా ఆధ్వర్యంలో కాలేజీ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్‌జెడి రవి, గండి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సురేంద్రబాబు, ఎస్ఐ బివి కృష్ణయ్య, మండలంలోని అన్ని జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానో పాధ్యాయులు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి రవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో లేనంత యువత భారతదేశంలో ఉందన్నారు. దేశంలో పుట్టినందుకు మనం ఈ దేశానికి ఏం చేశామన్నది ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకో వాలన్నారు. ముఖ్యఅతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మినరల్ వాటర్ మిషన్ దాత చలపతి నాగమల్లయ్య, వేముల ప్రిన్సిపల్ సుబ్బరామయ్య, చక్రాయపేట, చిలేకంపల్లి, మహాదేవపల్లె, నాగలగట్టుపల్లె, ప్రధానోపాధ్యాయులు రామాంజులు, పివి రమణ, ఎరికల్ రెడ్డి, సంజీవ్ కుమార్, కళాశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాన్ని రద్దు చేయడం తగదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

గత నెల కౌన్సిల్ సమావేశాన్ని ఏకపక్షంగా రద్దు చేయడం తగదని కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా పేర్కొన్నారు. శుక్ర వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజ సమస్యలను చర్చించే వేదిక కౌన్సిల్ సమావేశమని, దీన్ని రాజకీయంగా వాడుకునేందుకు యత్నించిన వైసిపి తీరును తీవ్రంగా ఖండించారు. సరైన కారణాలు తెలపకుండా వైసిపి కౌన్సి లర్లు వెళ్లిపోయారన్నారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా సభ నిర్వహించాలన్నారు. ఇప్పటికే ప్రజాసమస్యల పరిష్కారానికి సభ రెండు నెలలగా జరగలేదని అన్నారు. కొన్ని అంశాలమీద వివరణ, చర్చ కావాలంటే కోరవచ్చు. మరికొన్ని రోజులలో ఎప్పుడైనా సమావేశం ఏర్పాటు చేయవచ్చన్నారు. అలా చేయ కుండా సమావేశాన్ని రద్దు చేయాలని వైసిపి ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ప్యానెల్ కమిటీ సభ్యులను కౌన్సిల్ మినిట్స్ పుస్తకంలో నమోదు చేయలేదని, అలా చేసి ఉంటే తాను చైర్మన్ స్థానంలో కూర్చొని సభ నిర్వహిం చేవాడినన్నారు. తనకు ఆ అవకాశం రానందుకు బాధలేదు కానీ, సభ నిర్వహించాలనేదే తన తాపత్రయమన్నారు.



ఎపిజిబి ఎదుట ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

ఎపిజిబిని అమరావతికి తరలించొద్దు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)


ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కడపలో ఉన్న మెయిన్ బ్రాంచ్‌ను అమరావతికి తరలించొద్దని, కడపలోనే కొనసాగించాలని స్థానిక మైదుకూరు రోడ్డులోని లక్ష్మీ నగర వద్ద ఉన్న ఎపిజిబి వద్ద శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రొద్దుటూరు ఏరియా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ కడప జిల్లా హెడ్ క్వార్టర్‌లో ఉన్న ఎపిజిబి ఆరు జిల్లాలకు అనుసంధానంగా ఉందన్నారు. దాదాపు కోటి 35 లక్షలు అకౌంట్లు కలిగి ఉందన్నారు. బ్యాంకు గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, పేదలకు అందుబాటులో ఉందన్నారు. సప్తగిరి, గోదావరి, వికాస్, చైతన్య, వికాస్ ఈ బ్యాంకులను ఎపిజిబిలో విలీనం చేసి అమరావతికి తీసుకెళ్లాలని అనుకోవడం మంచి ఆలోచన కాదన్నారు. దాన్ని వెంటనే విరమించుకోవాలని, లేనిపక్షంలో ప్రజలను చైతన్యపరిచి ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు అందరూ దీనిపై స్పందించాలని ఆయన కోరారు. ధర్నాలో డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, సిపిఎం ఏరియా కార్యదర్శి శేఖర్, రాములమ్మ, శారద, లక్ష్మీదేవి, నరసింహ, మనోహర్ పాల్గొన్నారు.

వేంపల్లెలో అందుబాటులో ఆక్సిజన్

ప్రజాశక్తి - వేంపల్లె



స్థానిక పులివెందుల రోడ్డులోని కందుల కాంప్లెక్స్ వెనుక శ్వాసకోశ వ్యాధి గ్రస్తులకు ఆక్సిజన్ అందుబాటులో ఉన్నట్లు ఎస్‌కెబి ఏజెన్సీ నిర్వాహకుడు కమాల్ బాషా తెలిపారు. గతంలో శ్వాసకోశ వ్యాధి గ్రస్తుల రోగులు ఆక్సిజన్ అవసరమైతే దూర ప్రాంతాలైనా కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, రాయచోటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం వేంపల్లెలోనే ప్రజలకు అందుబాటులో ఆక్సిజన్ ఏజెన్సీని ఏర్పాటు చేశారు. అవసరమైన వారికి ఎస్‌కెబి ఏజెన్సీని సంప్రదిస్తే ఇంటికే ఆక్సిజన్‌ను సరఫరా చేస్తామన్నారు. ఆక్సిజన్ అవసరమైన వారు 91003 01832కు ఫోన్ చేయాలని ఏజెన్సీ నిర్వాహకుడు కమాల్ బాషా సూచించారు.



నాగేశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

వైసిపి నాయకుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని రహమత్‌ఖాన్‌పల్లెకు చెందిన మండల వైసిపి నాయకులు ఇరగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి పరామర్శించారు. నాగేశ్వరరెడ్డి కొంతకాలం క్రితం రోడ్డు ప్రమా దానికి గురై చికిత్స పొందుతూ ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. విశ్రాంతి తీసుకుని త్వరగా కోలు కోవాలని మాజీ ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మురళీ మోహన్ రెడ్డి, బి.మఠం జడ్‌పిటిసి రామ గోవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ నాస్తిక మేళా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలో ఉన్న చర్వాక ఆశ్రమంలో శని, ఆదివారాల్లో జరిగే 33వ జాతీయ నాస్తిక మేళాను విజయవంతం చేయాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకులు పల్లవోలు రమణ కోరారు. ఈ మేళాలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి అనేక మంది హేతువాద, నాస్తిక, అభ్యుదయ, వాపపక్ష నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. కడప జిల్లా నుంచి కూడా ఎక్కువ సంఖ్యలో ఈ మేళాకు హాజరవుతున్నట్లు తెలిపారు. వివిధ రూపాల్లో ఉన్న మత సంస్కృతి తోడుగ సామ్రాజ్య వాద విష సంస్కృతి తోడై ప్రజలను వెనక్కు నడిపిస్తుందని చెప్పారు. రైతులను ఆత్మహత్యలక గురిచేసే వ్యవసాయ విధానాన్ని రూపొందించి కార్పొరేట్ వర్గాలకు లాభాన్ని ఆర్జించి పెడు తుందని వివరించారు. ఈ స్వార్థపర శక్తులే సమాజంపై తమ పట్టు సడల కుండా ఉండటానికి అనేక పండుగలతో మత భావాలను జొప్పిం చార న్నారు.జాతీయ నాస్తిక మేళాకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల వ్యాప్తంగా విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ మండల ఇంజినీర్ నాగరాజు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

E.P.No 51 /2023
O.S.No. 313 /2013

వంకం సుబ్బరాయుడు, తండ్రి నాగమయ్య, వయస్సు 70 సం॥లు, హిందూ, వ్యాపారం, సాకిన్, డి.నెం.7/195, సుబ్బి రెడ్డి కొట్టాలు, చౌడేశ్వరి టెంపుల్ ఎదురుగా, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. హెచ్.ఆర్.

...పిటిషనర్/డి. హెచ్.ఆర్

Vs

1. గద్దె దస్తగిరి, తండ్రి హుస్సేనయ్య, వయస్సు 68 సం॥లు, హిందూ, వ్యాపారం, సాకిన్ డి.నెం.14/131, శ్రీనివాస పురం, సొసైటి కాలని, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.
2. గద్దె సాయి ప్రసాద్, తండ్రి దస్తగిరి, వయస్సు 38 సం॥లు, హిందూ, వ్యాపారం, సాకిన్ డి.నెం.14/131, శ్రీనివాస పురం, సొసైటి కాలని, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.

...రెస్పాండెంట్స్/జె.డి.ఆర్స్

RESPONDENTS/J.Dr.'sకు నోటీసు

పై నెంబరు ఇ.పిలో పిటిషనరు/డి. హెచ్.ఆర్ ఇ.పి షెడ్యూలు దాఖలా ఆస్థిని వేలం వేసి ఇ.పి మొత్తమును రాబ ట్టుకొనుటకుగాను మీపైన దాఖలు చేసి వున్నాడు. అట్టి ఇ.పి 18-03-2025వ తేది నాడు వాయిదా ఉంటున్నది. పై నెంబరు ఇ.పిలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 18-03-2025వ తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు యందు హజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనం తట మీ పరోక్షమున తీర్మాణించబడును.

SCHEDULE

Kadapa District, Proddatur Sub Registration District, Gopavaram Panchayat, Proddatur village fields the house site situated in survey No.313 pyki an extent of Ac.0.03 1/2 cents pyki Ac. 0.01 3/4 cents bearing Door No. 14/131, Srinivasapuram, Society Colony, Proddatur Town, bounded as follows: East : House of Kogatam Gopal Reddy, West : House of G.C.Peddanna, North : House of K. C. Pullaiah, South:30 feet width rastha, Measurements. East-West: 11 feet, North-South: 50 feet.

వాయిదా తేది: 18.03.2025

ఇ.వి.సుధాకర్ రెడ్డి,
యస్. నూరుల్లా,
అడ్వకేట్స్, ప్రొద్దుటూరు.